

# పట్నం.. పరవశం

మల్లన్న దర్శనంతో పులకించిన భక్తజనం

నేడు కొమురవెల్లి క్షేత్రంలో పెద్ద పట్నం, అగ్ని గుండం

గజ్జెల లాగులు.. ఢమరుక నాదాలు.. డోలు చప్పుళ్లు.. అర్చకుల పూజలు.. ఒగ్గు పూజారుల పట్నాలు.. పోతరాజుల విన్యాసాలు.. మహిళల బోనాల సమర్పణతో సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పులకించింది. ఆదివారం పట్నం వారంతో క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మల్లన్న నామస్మరణతో క్షేత్రం పరవశించింది.

# అవిశ్వాసాలు గట్టెక్కేనా ?

- కలెక్టర్ నిర్ణయం కోసం కౌన్సిలర్ల ఎదురుచూపులు
- క్యాంపుల్లోనే నిరీక్షణ
- ఆదిబట్ల మున్సిపల్ పీఠంపై కన్నేసిన కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ముమ్మర యత్నాలు

ఇబ్రహీంపట్నం, జనవరి 21 : రంగారెడ్డి జిల్లాలో పలువురు మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లపై పెట్టిన అవిశ్వాసాలు గట్టెక్కేనా అని పలువురు సందిగ్ధంలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, బండ్లగూడ మున్సిపల్ చైర్‌పర్సన్లతోపాటు ఆదిబట్ల వైస్ చైర్‌పర్సన్‌పై ఇప్పటికే మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాలంటూ కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. కాగా వారిని మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి రేసులో ఉన్న వారు క్యాంపులకు తీసుకెళ్లారు. అవిశ్వాస తీర్మానాలపై 30 రోజుల్లోపు కలెక్టర్ నిర్ణయం తీసుకుని గడువు ఇవ్వాల్సి ఉన్నది. కానీ.. ఆయన గడువు ఇస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం పెడుతూ కౌన్సిలర్లు కలెక్టర్‌కు దరఖాస్తు చేసి సుమారు నెలరోజులు కావొస్తున్నది. అందువల్ల ఈ మున్సిపాలిటీల చైర్‌పర్సన్లపై అవిశ్వాస గడువు వ స్తుందా లేదా అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. మరోవైపు అధికార కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్లలో కొంతమంది ఆ పార్టీ చైర్‌పర్సన్‌పైనే అవిశ్వాసం పెట్టాలంటూ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ బీఆర్‌ఎస్‌లో ఉండి.. ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆమెపై అవిశ్వాసం పెట్టాలంటూ బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరారు.



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

దీంతో ఏ ఒక్కరికీ అవిశ్వాసంపై గడువు ఇచ్చినా...మిగతా వారికీ ఇవ్వాల్సి ఉంటుంది.

ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను ఎలాగైనా గద్దె దించాలనే పట్టుదలతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లున్నారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచి, అనూహ్య పరిణామాల మధ్య బీఆర్‌ఎస్‌లో చేరిన కొత్త ఆర్తికగౌడ్ ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని అధిష్ఠించారు. కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఈ మున్సిపల్ చైర్మన్ పదవిపై ఎప్పటి నుంచో కన్నేసిన ఆదిబట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి ఇదే అవకాశాన్ని వాడుకుని అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో ఒత్తిడి చేయించి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి కలెక్టర్ అనుమతిస్తే ఇబ్రహీంపట్నం, బండ్లగూడ మున్సిపల్ చైర్‌పర్సన్లపైనా అవిశ్వాసానికి అనుమతి వస్తుందని కౌన్సిలర్లు భావిస్తున్నారు. మూడు మున్సిపాలిటీల అవిశ్వాస తీర్మానాలపై గడువు వస్తే మరికొన్ని మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్‌చైర్మన్లపైనా అవిశ్వాసాలు పెట్టాలనే ఆలోచనలో కౌన్సిలర్లు ఉన్నారు.




ఇటీవల మూసివేసిన వికారాబాద్ మండలంలోని పెంగ్విన్ రిసార్టు




పర్మిషన్ లేని రిసార్టులపై అధికారుల చర్యలు

- అనంతగిరి చుట్టూ పదుల సంఖ్యలో వెలిసిన రిసార్టులు
- ఇటీవల తొమ్మిది రిసార్టుల మూసివేత
- వికారాబాద్ మండల పరిధిలో ఆరు.. పూడూరు మండల పరిధిలో మూడు
- గత మూడేండ్లుగా అనుమతుల్లేకుండానే కొనసాగుతున్న రిసార్టులు
- నిర్వాహకులు ఇచ్చే డబ్బులతో అటువైపు తొంగి చూడని అధికారులు
- రాజకీయ ఒత్తిళ్లతోనే మూసివేస్తున్నారని ఆరోపణలు
- అధికారులు తీరుపై విమర్శల వెల్లువ

# అనుమతి లేదంటే.. మూసివేతే..

వికారాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): అనుమతుల్లేని రిసార్టులపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరిహిల్స్‌కు రోజుకు ఐదు వేల వరకు పర్యాటకులు వస్తుండడంతో వారిని ఆకర్షించేందుకు అనంతగిరి చుట్టూ పదుల సంఖ్యలో ప్రైవేట్ రిసార్టులు వెలిశాయి. అందులో చాలావరకు ఎలాంటి అనుమతుల్లేకుండానే నైట్ క్యాంపింగ్, గేమింగ్ క్లబ్, అడ్వెంచర్ ట్రిప్, బోటింగ్ తదితర వాటిని నిర్వహిస్తున్నాయి. రోజుకు ఒక్కో జంటకు రూ.2500 నుంచి రూ.3000 వరకు వసూలు చేస్తున్నాయి. అయితే గత మూడేండ్లుగా పదుల సంఖ్యలో రిసార్టులు నడు స్తున్నా పట్టించుకోని పంచాయతీ, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖల అధికారులు ఇటీవల అనుమతులుం టేనే కొనసాగించాలని..లేకుంటే మూసివేయాలని ఆదేశిస్తూ వికారాబాద్ మండలంలోని గోధమగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని వైల్డర్‌నెస్ క్యాంప్‌సైట్, పెంగ్విన్, మూన్‌లైట్ అడ్వెంచర్, టిక్కీ విలేజ్, నేచర్ రిట్రీట్, అవని ఫార్మ్ రిసార్ట్‌లతోపాటు పూడూరు మండలంలోని మన్నెగూడ సమీపంలోని మరో మూడు రిసార్టులకు రెండు సార్లు నోటీసులు జారీ చేసి మూసివేయించారు. వికారాబాద్, పూడూరు మండలాల్లో చాలా రిసార్టులున్నప్పటికీ కేవలం 9 రిసార్టులను మూసివేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అప్పుడు సక్రమం...ఇప్పుడు అక్రమమా..?**

జిల్లాలోని వికారాబాద్, పూడూరు, ధారూరు మండలాల్లో రిసార్టులు, క్యాంప్‌సైట్, గేమింగ్ క్లబ్, అడ్వెంచర్ క్లబ్‌లు పదుల సంఖ్యలో కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు సాఫీగా సాగిన వాటికి ఇప్పుడు అనుమతులు తీసుకోవాలని చెబుతున్న ఆయా శాఖల అధికారులు ఏనాడు కూడా ఏ ఒక్క రిసార్టును కూడా తనిఖీ చేసిన దాఖలాల్లేవు. అంతేకాకుండా పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులైతే రిసార్టుల నిర్వా హకులతో సత్సంబంధాలు కొనసాగించారు. మామూళ్లకు లొంగిపోయారు. గతంలో జిల్లాలో పనిచేసి న ఓ పోలీస్ అధికారికి ఓ రిసార్టులో పర్మినెంట్ రూమ్‌ను కేటాయించడం గమనార్హం. ఆ అధికారి ప్రతిరోజూ రాత్రి ఆ రిసార్టుకు వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. రిసార్టులలో ఏదైనా ప్రమాదం జరిగి బయటికి వస్తే తప్ప రిసార్టుల జోలికి పోలీసులు, ఇతర శాఖల అధికారులు వెళ్లేవారుకాదు. దీంతో అప్పుడు సక్రమం అయినది.. ఇప్పుడు అక్రమమా అంటూ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుండడం శుభ పరిణామమే అయినప్పటికీ.. సంబంధిత శాఖల అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించలేదనే ఆరోపణలున్నాయి. మరోవైపు కొన్ని రిసార్టులకే నోటీసులు, మూసివేయించడంపై రాజకీయ ఒత్తిళ్లున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. కోట్‌పల్లి ప్రాజెక్టులో ఓ పార్టీకి చెందిన నేత నిర్వహిస్తున్న బోటింగ్ కార్యకలాపాలను మొన్నటి వరకు నిలిపివేయగా.. పది రోజుల నుంచి మళ్లీ పునఃప్రారంభమయ్యాయి. అదేవిధంగా మొన్నటివరకు మరో పార్టీ నేత ఆధ్వర్యంలో కొనసాగిన సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు ఆనుకొని ఉన్న వైల్డర్‌నెల్ రిసార్టు, సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్‌ను ఇటీవల నిలిపివేశారు. ఇదంతా చూస్తుంటే రాజకీయ నాయకుల ఒత్తిళ్లే కారణమనేది జిల్లా అంతటా చర్చ జరుగుతున్నది.

**ఈ అనుమతులు తప్పనిసరి..**

ప్రైవేట్ రిసార్టులు నిర్వహించాలంటే అనుమతులు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రిసార్టు లేదా గేమింగ్ హబ్, క్యాంప్‌సైట్, అడ్వెంచర్ ట్రిప్ తదితరాలను నిర్వహించాలంటే ముందుగా రెవెన్యూ శాఖ నుంచి నాలా(వ్యవసాయేతర భూమి) ధ్రువీకరణ పత్రాన్ని .. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిర్వహించాలంటే రెవెన్యూశాఖ నుంచి ఎన్‌వోసీ.. రిసార్టులలో అడ్వెంచర్ గేమ్స్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కు పోలీసుశాఖ నుంచి, క్యాంప్ ఫైర్ ఏర్పాటుకు అగ్నిమాపక శాఖ నుంచి.. చెరువుల్లో బోటింగ్ నిర్వహణకు నీటిపారుదల శాఖ నుంచి.. రిసార్టు ఏర్పాటు చేసే భూమి అటవీశాఖకు సంబంధంలేదని అటవీ శాఖ నుంచి ఎన్‌వోసీ, కార్మిక శాఖ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని, గ్రామ పంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్స్, అదేవిధంగా రిసార్టులలో 300 గజాలలోపు భవన నిర్మాణాలకు గ్రామ పంచాయతీల నుంచి.. 300 గజాలపైన భవన నిర్మాణాలకు డీటీసీపీ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. పర్మినెంట్ రెస్టారెంట్ భవన నిర్మాణానికి డీటీసీపీ అనుమతితోపాటు ఫుడ్, మద్యం విక్రయాలకు సంబంధించి ఫుడ్ సేఫ్టీ అధికారులతోపాటు ఎక్సైజ్ అధికారుల అనుమతి అవసరం.

**అనుమతులు తప్పనిసరి తీసుకోవాల్సిందే..**


రిసార్టులు, అడ్వెంచర్ క్లబ్‌లు, గేమింగ్ హబ్ తదితరాలు నిర్వహించాలంటే పంచాయతీ, రెవెన్యూ, పోలీసు, అటవీ, అగ్నిమాపక, నీటిపారుదల శాఖల అనుమతులు తప్పనిసరి. ఇప్పటికే పలు రిసార్టులకు రెండు సార్లు నోటీసులు జారీ చేసి మూసివేయించాం. త్వరలోనే మిగతా రిసార్టులను నేరుగా సందర్శించి అనుమతులు లేకుంటే నోటీసులు జారీ చేస్తాం.

– తరుణ్‌కుమార్, వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి




ఇటీవల మూసివేసిన వికారాబాద్ మండలంలోని గోధమగూడలోని నేచర్ రిట్రీట్ రిసార్టు

# పంచాయతీ పాలన.. ఇక ప్రత్యేకమేనా..



- పర్సన్ ఇన్‌చార్జీలా ? స్పెషల్ ఆఫీసర్లా ? అన్నదానిపై కొనసాగుతున్న సస్పెన్స్
- రిజర్వేషన్లపైనా సర్వత్రా చర్చ
- మూడు, నాలుగు రోజుల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడే అవకాశం
- ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పాలకవర్గాల గడువు
- జిల్లాలోని 558 పంచాయతీలు, 4,992 వార్డులు


రంగారెడ్డి, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్నది. ఇప్పటివరకు ఎన్నికలకు సంబంధించి ఎటువంటి నోటిఫికేషన్ వెలువడలేదు. దీంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో 558 గ్రామపంచాయతీలు ఉండగా.. వీటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో పర్సన్ ప్రస్తుత సర్పంచులనే ఇన్‌చార్జీలుగా నియమిస్తుందా ? లేక ప్రత్యేక అధికారులతో పాలన కొనసాగిస్తుందా ! అన్నదానిపై సస్పెన్స్ నెలకొన్నది. మరో పక్క పాత రిజర్వేషన్లతో ఎన్నికలను నిర్వహిస్తారా ? లేక రిజర్వేషన్లను మార్చి నిర్వహిస్తారా ? అన్నదానిపై కూడా చర్చ జరుగుతున్నది. వచ్చే మూడు, నాలుగు రోజుల్లో ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఎన్నికలు ఇక లేనట్లే !..**

జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు, 4,992 వార్డులు ఉన్నాయి. 2019లో వీటికి మూడు విడుతలుగా ఎలక్షన్ కమిషన్ ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు ఫిబ్రవరి 1న బాధ్యతలు స్వీకరించారు. మరో తొమ్మిది రోజుల్లో వీరి పదవీ కాలం ముగియనున్నది. ఎన్నికలు నిర్వహించదల్చితే కనీసం నెలన్నర రోజుల ముందే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉండేది. ఇప్పటి వరకు ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. దీంతో కొద్దిరోజులుగా ఎన్నికల హడావిడి చేసిన అధికారులు ప్రస్తుతానికి మిన్నకుండిపోయారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా ఆగాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా.. తమ పదవీకాలాన్ని మరికొంత కాలం పొడిగించాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఎన్నికలు నిర్దేశిత గడువులోపు జరగకపోవడంతో ప్రభుత్వం అనుకుంటే పర్సన్ ఇన్‌చార్జీలుగా ప్రస్తుత సర్పంచులనే కొనసాగించే అవకాశం ఉన్నది. 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం.. గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించని పక్షంలో ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగించాలని చట్టంలో స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల నియామకం వైపుగానే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. మండల స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించేందుకు అవసరమైన ప్రక్రియ అంతర్గతంగా ఇప్పటికే జిల్లాలో మొదలైనట్లు సమాచారం.

**రిజర్వేషన్లు మారితే ఎన్నికలు మరింత ఆలస్యం..**


బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం అమలులో ఉంటుంది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పాత విధానాన్నే కొనసాగిస్తారా ? లేక మార్పులు ఏమైనా ఉంటాయా ? అన్నదానిపై సందిగ్ధత నెలకొన్నది. బీసీల రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే 2006 సంవత్సరం ఎన్నికల నుంచి కొనసాగిన బీసీఈ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను ఇటీవలనే బీసీ కమిషన్ సేకరించింది. రిజర్వేషన్లు మార్చాలంటే మరోసారి చట్టం చేయాల్సి ఉండడంతో ఎన్నికలు మరింత ఆలస్యం కానున్నాయి. ఒకవేళ చట్టాన్ని సవరించకుండా పాత విధానాన్నే కొనసాగిస్తే.. ప్రస్తుతం రిజర్వుడ్ స్థానాల్లో సర్పంచ్‌గా ఉన్నవారు.. మరోసారి పోటీలో నిలిచేందుకు అవకాశం కలుగుతుంది.



# కొత్త ఓటరు నమోదుకు విశేష స్పందన

- ఓటు హక్కు కోసం 1,871 దరఖాస్తులు
- తొలగింపు, సవరణల కోసం మరో 2,035 దరఖాస్తులు
- జిల్లాలో 3,369 పోలింగ్ స్టేషన్లలో దరఖాస్తుల స్వీకరణ
- శని, ఆది వారాల్లో స్పెషల్ డ్రైవ్ విజయవంతం

రంగారెడ్డి, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : ఓటరు నమోదులో భాగంగా జిల్లాలో శని, ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన వచ్చింది. జిల్లావ్యాప్తంగా 3,369 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులను నిర్వహించారు. జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని చాలామంది సద్వినియోగం చేసుకున్నారు. ఓటు హక్కు కోసం 1,871 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓట్ల తొలగింపునకు 808 మంది, చిరునామా మార్పు, వివరాల సవరణకు 1,227 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక క్యాంపుల నిర్వహణలో 3,369 మంది బీఎల్‌వోలు పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్ శశాంకతోపాటు ఏఈఆర్వోలు, ఈఆర్వోలు, డీఈవోలు పర్యవేక్షించారు.



జిల్లాలో దరఖాస్తుల వివరాలు ఇలా..

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | ఫారం-6 | ఫారం-7 | ఫారం-8 |
|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 319 | 171 | 128 | 269 |
| ఎల్బీనగర్ | 570 | 145 | 88 | 160 |
| మహేశ్వరం | 511 | 72 | 41 | 33 |
| రాజేంద్రనగర్ | 535 | 342 | 176 | 118 |
| శేరిలింగంపల్లి | 622 | 700 | 09 | 414 |
| చేవెళ్ల | 298 | 224 | 326 | 88 |
| కల్వకుర్తి | 262 | 125 | 37 | 112 |
| షాద్‌నగర్ | 252 | 92 | 03 | 33 |
| మొత్తం | 3,369 | 1,871 | 808 | 1,227 |